## బీఆర్ఎస్ అంటేనే..

**మళ్లీ కేసీఆర్ సర్కార్ రావాలి.. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలి..!**

# అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా



గాజులరామారం డివిజన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

- పదేండ్లలో రూ.6వేల కోట్లతో అభివృద్ధి చేశా
- కుత్బుల్లాపూర్ అప్పుడెట్లుండె.. ఇప్పుడెట్లైంది..?
- ప్రజలు బేరీజు వేసుకొని ఓటు వేయాలి
- ఎన్నికల ప్రచారంలో కుత్బుల్లాపూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

దుండిగల్, నవంబర్ 24 : అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే.. కేసీఆర్ సర్కార్ మళ్లీ రావాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డినగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్, కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా జీడిమెట్ల డివిజన్‌లోని స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీలో, గాజులరామారం డివిజన్ పరిధిలో కార్పొరేటర్ రావులశేషగిరిరావుతో, చింతల్ డివిజన్ పరిధిలో డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ రఫీతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వతంత్ర్య భారతంలో 75ఏండ్ల కాలంలో జాతీయ పార్టీలు చేయలేని అభివృద్ధిని తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిదిన్నర ఏండ్ల కాలంలోనే సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో జరిగిన అభివృద్ధే ఇందుకు సాక్ష్యమన్నారు. ఒక్క కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనే రూ.6వేల కోట్ల పైచిలుకు నిధులతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గతంలో కుత్బుల్లాపూర్ ఎట్లుండే...? ఇప్పుడు ఎట్లుంది..? అనే అంశాలను ప్రజలు బేరీజు వేసుకొని ఓటు వేయాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేశామని తెలిపారు. రానున్న కాలంలో మరింత అభివృద్ధి జరుగాలన్నా.., సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై ఓటువేసి ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల నేతలు చెప్పే కల్లబొల్లి మాటలు విని మీ విలువైన ఓటును వృథాచేయవద్దని తెలిపారు. వివేకానంద్ ప్రచారానికి విశేషస్పందన లభించింది. అడుగడుగునా మహిళలు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బూర్గుబావి హన్మంతరావు, దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, మహ్మద్ మక్సూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## ఇక్కడ స్థిరపడిన వారంతా మనవాళ్లే

- ఏ ఇబ్బందులు లేకుండా.. కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నాం
- జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్
- బీఆర్ఎస్‌లో చేరిన అగ్నికుల క్షత్రియులు



బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న బోరబండకు చెందిన అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు, సభ్యులు

బంజారాహిల్స్, నవంబర్ 24 : దేశంలోని అన్ని రాష్ట్రాలనుంచి హైదరాబాద్‌లో స్థిరపడిన ప్రజలందరినీ కడుపులో పెట్టుకొని చూసుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ సైట్-3లోని సాయిబాబా నగర్ బస్తీ అధ్యక్షుడు రమేశ్‌నాయక్ ఆధ్వర్యంలో అగ్నికుల క్షత్రియులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మాగంటి గోపీనాథ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉత్తరాంధ్ర ప్రాంతంనుంచి సుమారు మూడు దశాబ్దాల కిందట హైదరాబాద్ నగరానికి వచ్చి ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నామని, బీఆర్ఎస్ పార్టీకి మద్దతు పలికితే తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో పార్టీలో చేరుతున్నామని అగ్నికుల క్షత్రియ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.పల్లపు రాజు అన్నారు. ఈ సందర్భంగా మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత నగరంలో అన్ని ప్రాంతాల ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని, వారందరినీ బీఆర్ఎస్ ప్రభుత్వం కడుపులో పెట్టుకొని చూసుకుంటున్న విషయాన్ని ప్రజలంతా గమనించి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కేవలం ఎన్నికల కోసం కులాలు, ప్రాంతాల పంచాయితీలు పెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ప్రయత్నాలకు ప్రజలు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. నియోజకవర్గంలోని అగ్నికుల క్షత్రియుల సమస్యలు పరిష్కరిస్తామని, భవన నిర్మాణం కోసం స్థలాన్ని కూడా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు సీహెచ్.శ్రీనివాస్, అంగాని వర్మ, కలాడి నాగరాజు, బి.ధర్మరాజు, కె.శ్రీనివాస్, కె.సాయి, సి.నాగరాజు, పి.శ్రీను, కలాడి అనుపమ, పద్మ, వెంకటలక్ష్మి, నాగమణి, తదితరులు ఉన్నారు.

## కాలేరుకు ప్రజలు బ్రహ్మరథం



మ్యానిఫెస్టోలోని సంక్షేమ పథకాలను వివరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాలేరు వెంకటేశ్, తదితరులు

కాచిగూడ, నవంబర్ 24 : అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రత్యర్థుల అంచనాలకు అందకుండా కారు దూసుకుపోతున్నది. శుక్రవారం అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు మహిళలు బ్రహ్మరథం పట్టారు. ఏకగ్రీవ తీర్మానాలను అందజేసి మద్దతు తెలిపారు. కాచిగూడ డివిజన్‌లోని బాలప్పబాడ, కుర్మబస్తీ, లింగంపల్లి, చెప్పల్‌బజార్ ప్రాంతాల మహిళలు ప్రచారానికి వచ్చిన కాలేరు వెంకటేశ్‌కు మంగళహారతులతో బ్రహ్మరథం పట్టారు.

## ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి



ముస్లింలను ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత, ఎన్నికల ఇన్‌చార్జి గజ్జెల నాగేశ్

కంటోన్మెంట్, నవంబర్ 24 : 'ఒక్క అవకాశం ఇవ్వండి.. ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి.. మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా.. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని' కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత అన్నారు. శుక్రవారం కంటోన్మెంట్‌లోని కార్ఖానా జామా మసీద్ వద్ద కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి, బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, బోర్డు మాజీ సభ్యురాలు అనితాప్రభాకర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కంటోన్మెంట్‌లోని అన్ని మసీదులకు మరిన్ని నిధులు కేటాయిస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తనకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పణ



అబిడ్స్, నవంబర్ 24 : బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించాలని అజ్మీర్ దర్గాలో చదర్ సమర్పించినట్లు రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎంకే బద్రుద్దీన్ తెలిపారు. అజ్మీర్ దర్గా నిర్వాహకులు శుక్రవారం రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీని ఆయన నివాసంలో కలిసి చాదర్‌ను అజ్మీర్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

## బీఆర్ఎస్‌కు టీఎమ్మార్పీఎస్ మద్దతు

**టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఇటుక రాజు**



విలేకరులతో మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ

కంటోన్మెంట్, నవంబర్ 24: అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ కార్యచరణ ఉన్నందున ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ స్పష్టం చేశారు. కంటోన్మెంట్‌లోని బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితుల అభ్యున్నతికి అంబేద్కర్ తరువాత అంతగా ఆలోచించిన మేధావి సీఎం కేసీఆర్ అని కొనియాడారు. దళితుల పక్షపాతిగా సీఎం కేసీఆర్ చరిత్రలో నిలుస్తారన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి దళితులంతా పూర్తి మద్దతు అందిస్తామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ 100 రోజుల్లో అంటూ మోసం చేసిన బీజేపీ, వర్గీకరణ చేపట్టకుండా మాదిగ యువకుల ప్రాణాలను బలి తీసుకున్న కాంగ్రెస్ పార్టీలకు మాదిగ, మాదిగ ఉప కులాలు ఒక్క ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి గ్యాని లాస్యనందిత భారీ మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో కాలయాపన చేస్తున్న మోదీ సర్కారుకు మందకృష్ణ మాదిగ మద్దతుగా నిలవడంపై మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మందకృష్ణ కుమ్మక్కై దళితులకు తీరని ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర నాయకులు ఎల్.పెద్దరాజు, శివకుమార్, తరుణ్, ఇటుక గోపి, రామారావు, జాన్సన్, ధీరజ్, గిరి, వెంకట్, శ్రీనివాస్, జాన్, శివకుమార్, నాగేశ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## కాలికి బలపం కట్టుకొని ఎల్బీనగర్‌ను అభివృద్ధి చేశా

- ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని నేతలను తిరస్కరించాలి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బృందావన్‌కాలనీలో ఇంటింటి ప్రచారానికి వచ్చిన సుధీర్‌రెడ్డికి మంగళహారతులు ఇచ్చి తిలకం దిద్దుతున్న మహిళ

ఎల్బీనగర్, నవంబర్ 24 : ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రజల సంక్షేమం కోసం కాలికి బలపం కట్టుకొని తిరుగుతున్నానని, చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లింగోజిగూడ డివిజన్‌లోని ఎల్బీనగర్ పాత గ్రామంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎప్పుడూ నియోజకవర్గం మొఖం చూడని, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని నేతలను తిరస్కరించాలని సూచించారు. తెలంగాణ అభ్యున్నతి కోసం, భవిష్యత్తు తరాల సంక్షేమం కోసం బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ సహకారంతో ఇచ్చిన అన్ని గ్యారెంటీలను పూర్తి చేశానని తెలిపారు. నియోజకవర్గం హద్దులు కూడా తెలియని పార్టీ అభ్యర్థులు రాజకీయ పునరావాసం కోసం కాలనీల చుట్టూ చక్కర్లు కొడుతూ ఓట్ల కోసం ప్రాదేయపడటం హాస్యాస్పదమన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రజలే తనను గెలిపించుకుంటారని, కారు గుర్తుకు ఓటువేసి ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరప్రసాద్‌రెడ్డి, శ్రీధర్, ఇంద్రాజీ, భాస్కర్ గంగపుత్ర, నర్సింహగుప్త, తిలక్‌రావు, పాషా, షఫీ, కిట్టు, తదితరులు పాల్గొన్నారు.